


# నేదూకుంటాన్రయ్యా!

రాయప్పరెడ్డి సత్యనారాయణ

చీకటి పడుతుండగా యింటిముందు రిక్షా ఆపాడు రాముఁడు!

నుదుటికి పట్టిన చెమటను కండువాతో తుడుచుకొంటూ మరోచేత్తో రిక్షా సీటును పట్టుకొని లోపలికి నడుస్తూ అలవాటు ప్రకారం భార్యను కేకేశాడు.

"సీతాలూ!"

లోపల్నుండి సమాధానం లేదు.

గుడిసెకు వ్రేలాడుతోన్న తడికె తలుపును కొద్దిగా లోపలికి తోసి చూశాడు.

యుద్ధభూమిలో శత్రుసైనికుల చేతుల్లో చిక్కిన ఒంటరి సైనికుడిలా గాఢాంధకారంతో నిస్సహాయంగా యుద్ధంచేస్తూ రెపరెపలాడుతోంది గుడిసెలోని గుడ్డిదీపం! దీపానికి కొంచెం దూరంలో నేలమీద పడుకొని గాఢ నిద్రలో వుంది సీతాలు!

'పిచ్చిసీతాలు. పగలంతా రెక్కలు ముక్కలయ్యేలా పన్జేసి ఒళ్ళల్సి నేల మీద నిద్దరోతన్నాది! నీ కెందుకొచ్చిన కష్టఁవే అంటే యిన్దు!"

'యేణ్ణీళ్ళకి సన్నీల్లు తోడు మాఁవా! సీకటితో బండేసుకెళ్తే మల్లా సీకటడ్డాక గానీ యిల్లు జేరవు నువ్వు. నువ్వెల్లిం తర్వాత సదుకోడానికని 'సిన్నోడు' బళ్ళో కెల్లిపోతాడు మీరొచ్చిందాకా ఒక్కదాన్నే యింట్లో ఎట్టా కూసోను?" అంటూ తను ఎంత వొద్దన్నా వినకుండా నాలుగిళ్ళల్లో పాచిపనికి కుదిరింది సీతాలు!

అరుగుమీది నులకమంచాన్ని వాల్చి జేబులోంచి బీడీముక్క తీసి వెలిగించి గుండెల్నిండా పొగ లాగి వొదుల్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు రాముఁడు.

నిజానికి తాను బ్రతికుండగా 'సీతాలు' పాచిపనులు చేయటం సుతరామూ ఇష్టం లేదు తనకు! ఆ మాటే చెప్పి శతవిధాల నచ్చజెప్పటానికి ప్రయత్నించా డిదివర కెన్నోసార్లు.

రెక్కాడితేగానీ డొక్కాడని పేదోల్లము! పరువూ, అభిమానాలూ మనకి కూడెడ్తాయా మాఁవా! నువ్వుండగా తిండికీ, బట్టకి నాకెలాగూ లోట్లేదు! నీ శాకిరీకి నా కష్టం తోడైతే మన సిన్నోడికి మంచి బట్టలు కుట్టించొచ్చు! నాలు

**1985 చక్రపాణి అవార్డు పొందిన కథ**

గచ్చరమ్మ్మక్కలు సెప్పించుకోవచ్చు!"

సీతాలు అంతగా చెప్తుంటే కాదన్లేక ఆ రోజున మౌనంగా ఉండిపోయేడు తాను!

'ఏమైనా సరే, రేపట్నుంచీ సీతాల్ని పన్లోకి పంపగూడదు!' బీడీ దమ్ము బిగబట్టి లాగి వదుల్తూ మనసులోనే గట్టిగా నిర్ణయించుకున్నాడు రావుడు.

"ఎంత సేపైంది మావాఁ నువ్వొచ్చి?"

రావుఁడి ఆలోచన్లకు అంతరాయం కలిగిస్తూ గుమ్మంలో నిలబడి నిద్ర కళ్ళను ఒత్తుకొంటూ అడిగింది సీతాలు!

"యిప్పుడేనే. యింద. ఎంతో లెక్కెట్టు!" చిల్లరడబ్బుల్ని భార్య చేతుల్లో పోశాడు రావుఁడు.

"సీతాలికి సీరలన్నీ సప్పగా సిరిగి పోయాయ్! ఆ సిరుగులు ఎక్కడ తన కంట బడతయ్యోనని జాగర్తగా కుట్టుకొని ఒళ్ళు కప్పుకొంటున్నాది. చీకట్లో చిల్లర లెక్క పెడ్తోన్న సీతాల్ని పరిశీలగా చూస్తూ మనసులో అనుకున్నాడు రావుఁడు.

"పదిహేడ్రూపాయలు" డబ్బు లెక్కచెప్పి యింట్లోకెళ్ళింది సీతాలు.

"ఆకలౌతన్నాది కూడొడ్డించవే!" సీతాలికి వినిపించేలా కేకేసి పెరట్లోని నీళ్ళతొట్టివైపు నడిచాడు రావుఁడు. చెమటతో తడిసిపోయిన శరీరాన్ని నాలుగయిదు చెంబుల నీళ్ళతో కడిగి కంచం ముందుకొచ్చి కూర్చున్నాడు.

"ఆడేడే?" అన్నంముద్దలు కలుపబోయి ఆగి యిల్లంతా కలయజూస్తూ అడిగాడు సీతాల్ని.

"రావుఁలోరి గుడికాడ లైటుతంబం ఎలుగులో కూసొని సదూకుంటన్నాడు!" భర్త చేతికి మంచినీళ్ళ చెంబు అందిస్తూ అంది సీతాలు.

"పిచ్చిసన్నాసి! ఆడికి సదువంటే పేణం! మనసులోనే నవ్వుకొని మౌనంగా అన్నం తినటం ప్రారంభించాడు రావుఁడు.

"మావాఁ!"

కొంత నిశ్శబ్దం తర్వాత గొంతు విప్పింది సీతాలు!

"ఊఁ!" అన్నం తినటం ఆపి సూటిగా భార్య కళ్ళల్లోకి చూశాడు ఏవిఁటన్నట్లుగ.

"సిన్నోణ్ణి సదివించుకుందాం మావాఁ!"

రావుఁడు మాట్లాడలేదు! మౌనంగా కంచంలోని మెతుకుల్ని కెలకసాగాడు!

"ఏంది మావాఁ మాట్టాడవ్? పెద్దింటి పాపయ్యగోరిమనవడూ, మన సిన్నోడూ అయిదోకలాసు ఒకే బళ్ళో కలిసి సదివారంట. అన్ని పరిచ్చల్లోనూ ఆ బాబు కంటే మన సిన్నోడికే శానా పెద్ద మార్కులొచ్చాయంట. పాపయ్యగోరు మనవణ్ణి అయిస్కూల్లో జేరిపించి నెల్రోజులైంది యియ్యాల్టికి. అది తెల్సి సరిగ్గా కూడు కూడా తిన్డం మానేశాడు

సినోన్నడు. అయిస్కూల్లో జేరిపించే వొరకూ కూడూ నీల్లూ ముట్టనని సిందు ల్తోక్కి పుత్తకం పుచ్చుకొని గుడికాడి కెల్లిపోయాడు" కొంగు నోట్లో కుక్కుకొంది సీతాలు.

ముద్ద నోట్లోకెళ్ళలేదు రావుఁడికి!

"పెద్దకులంలో పుట్టిన పున్నెనికి పాపయ్యగోర్ని 'పెద్దింటి పాపయ్యగారూ!' అని పిలుత్తారు అ ఈడిలో అందరూ. ఆ ఈడిలో ఎవరికి ఏ గొడవొచ్చినా ఆయనే సర్దుబాటు సెయ్యాల! అందుకే ఆయనంటే ఆ ఈడిలో అందరికీ వొల్లమాలిన గవురము. పాపయ్యగోరికి ఆ ఈడిలో రొండు మేడలున్నయ్! ఊళ్ళో పెద్ద యాపారవుంది! మరి తనో! రెక్కాడితేగాని డొక్కాడని రిచ్చావోడు! ఆకలేత్తే అన్నం తినడానికో కంచం, నిద్దరొత్తే కునుకుతియ్యడానికో మంచమూ తప్ప మరే ఆస్తిపాస్తులూ లేనోడు. అదీగాక అయిస్కూలు సదువంటే మాటలా!! గొప్పగొప్ప పుత్తకాలు కొనాల! వొందలొందలు పీజు కట్టాల! ఈటన్నిటికీ కనీసం మూడొందలన్నా సేతుల్లో వుండాల!"

అ మాటే చెప్పాడు సీతాల్తో!

"ఆడికి చదువంటే పంచెపేణాలు మావాఁ! కూడూ నీల్లూ లేకపోయినా ఉండగల్డేమోగానీ, సదువు మానిపిత్తే పిచ్చోడయిపోతాడు! ఎట్టాగయినా అణ్ణి అయిస్కూల్లో జేరిపించు మావాఁ. మన్లాంటి పేదోల్ల పిల్లలకి సదూకోడానికి గవుర్మెంటోల్లు ఫీజులూ, పుత్తకాలూ ఊరికే యిత్తారంట. ఆస్టల్లో జేర్చుకోని కూడుగూడా పెడతారంట! గడుపుగట్టుకొనయినా అణ్ణి సదివించుకుందాం మావాఁ! కాదనకు" సీతాలు కళ్ళల్లో పెల్లుబుకుతోన్న కన్నీటిని చూసి గునపాల్తో గుండెలు కెలికినట్లయ్యింది రావుఁడికి.

"అట్టాగేలేయే!"

భార్యను గుండెకు హత్తుకొని చాటుగా తనూ కళ్ళు తుడుచుకున్నాడు రావుఁడు.


* * *

అర్ధరాత్రి దాటింది!

చీకటి ఒడిలో అలసిపోయిన పసిపాపలా అమాయకంగా నిద్రిస్తోంది లోకం!

నిద్ర రాక నులకమంచంమీద అటూ యిటూ దొర్లుతున్నాడు రావుఁడు. రావుఁడికి ఓ ప్రక్కగా నేలమీద 'సీతాలు' పడుకొని వుంది. మరోప్రక్క ఏదో పుస్తకాన్ని గుండెలిమీద పెట్టుకొని 'సినోన్నడు' నిద్రపోతున్నాడు.

'యాబయ్యా వందా కాదు!... మూడొందలు!!! సీతాలికి మాటయితే తేలిగ్గా యిచ్చేశాడు గానీ, ఒక్కసారిగా అంతడబ్బు ఎక్కణ్ణుంచి తేగల్డు తను?... పోనీ దేన్నయినా తెగనమ్ముదా




మంచే కుట్టుపడ్డ కట్టుగుడ్డ తప్ప తమ దగ్గరేముందని!"

"ఏమైనా సరే సిన్నోణ్ణి సదివించుకోవాల!... అవును! ఆణ్ణి సదివించుకోవాల!!" పిచ్చెక్కినట్లు ఒకటికి పది సార్లు లోలోపలే కలవరించాడు రావుడు

"సదూకుంటా నయ్యా! నే సదూకుంటా!!" నేలమీద పడుకొని నిద్దట్లో కలవరిస్తున్నాడు 'సిన్నోడు'!

ప్రేమగా కొడుకు తల నిమిరి ఏ వేకువజాముకో నిద్రలోకి జారుకున్నాడు రావుడు!

గణగణమంటూ మ్రోగింది బడి గంట!

విద్యార్థులంతా జండావందనం చేసేందుకు స్కూలు గ్రౌండులో బారులుతీరి నిలబడ్డారు.

రిక్షాలో 'సిన్నోడి'తో స్కూలు గేటు ముందుకొచ్చి ఆగాడు రావుడు.

"ఏయ్ ఎవరుకావాలయ్యా నీకు?" రావుణ్ణీ, సిన్నోణ్ణీ గేట్లోనే ఆపి కసురుకుంటూ మీదకొచ్చాడు స్కూలు వాచ్ మన్.

"పిల్లోణ్ణి బళ్ళో ఎయ్యాల బాబూ!" సాధ్యమైనంత వినయంగానే చెప్పాడు రావుడు. క్షణంసేపు రావుణ్ణీ, సిన్నోణ్ణీ ఎగాదిగా చూశాడు వాచ్ మన్.

అతనలా ఎందుకు చూస్తున్నాడో అర్థంకాలేదు రావుడికి.

ఉన్నవాటిల్లో కాసిని మంచిబట్టల్నే ఉతికి ఆరేసి కట్టుకున్నారు తనూ సిన్నోడూనూ!

"లోపల డ్రిల్లు జరుగుతోంది. అదయింతర్వాత వెళ్ళు!"

"అట్టాగే బాబూ!" వాచ్ మన్ కంఠంలో తొంగిచూసిన ఊహించని సౌమ్యానికి అతనికి మనసులోనే ధన్యవాదాలర్పించుకొని బిక్కుబిక్కుమంటూ

గేటు పట్టుకొని నిలబడ్డాడు రావు(డు.

తెల్లని యూనిఫాంలో బూటుకాళ్లతో టకటకమని డ్రిల్లుచేస్తూ ఏటిగాలికి అల లపై వయ్యారంగా ఊగే మల్లెపూల పడ వల్లా వున్నారు విద్యార్థులంతా! వాళ్ళలో తన 'సిన్నోణ్ణి' ఊహించుకొంటూ ఎంత సేపు అలా గేటుపట్టుకొని నిలబడి పోయాడో తెలీదు. "అయ్యగారు పిలు స్తున్నారు లోపలికెళ్లు!" అన్న వాచ్ మన్ మాటల్తో ఈ లోకంలో కొచ్చిపడి, భయం భయంగా హెడ్మాస్టారి గదివైపు నడిచాడు.

సువిశాలమైన స్కూలుగ్రౌండు!

మధ్యలో...

బిక్కుబిక్కుమనే గుండెతో 'సిన్నోడి' చెయ్యి పట్టుకొని అడుగేసు కొంటూ హెడ్మాస్టరు గదివైపుగా రావు(డు!

క్లాస్‌రూం కిటికీల్లోంచి ఆ తండ్రి కొడుకు లిద్దరివంకా విచిత్రంగా చూస్తూ స్కూలుపిల్లలు!!

"దండాలయ్యగోరూ!"

హెడ్మాష్టారు రూంలోకి అడుగు పెడ్తూ వినయంగా నమస్కరించాడు రావు(డు.

ఎదురుగా వున్న కుర్చీ చూపించా రాయన కూర్చోమన్నట్లుగ.

రావు(డి ఆనందానికి అవధుల్లేవు!

'ఈ రోజుల్లో తన్లాటి రచ్చావోడికి కూసోమని కుర్చీసూపించీవోల్లు కూడా వున్నారా?!" ఆశ్చర్యంతో బొమ్మలా గుడ్లప్పగించి చూస్తూ నిలబడటం తప్ప మరేం చేయలేకపోయాడు రావు(డా క్షణంలో.

"ఆ కుర్రాడు...?" ఫైల్లోంచి తల పైకెత్తి 'సిన్నోడి' వంక పరీక్షగా చూస్తూ అడిగారు హెడ్మాష్టారు.

"ఈడు నా కొడుకయ్యగోరూ! పేరు 'సిన్నోడు.' నన్ను రావుడంటారు. ఈ వూళ్ళోనే రిచ్చాలాగి బతుకుతుంటాను. సదువంటే ఈడికి పంచపేణాలయ్య గోరూ! అయిదో కలాసులో మా ఊరి పెద్దింటి పాపయ్యగోరి మనవడికంటే మా 'సిన్నోడి'కే శానా పెద్దమార్కు లొచ్చాయంట! ఈణ్ణి తవ(రి అయి స్కూల్లో జేరిపిద్దామని ..." నీళ్ళు నముల్తూ జేబులోంచి మార్కులకాగితం తీసి చూపించాడు రావు(డు.

హెడ్మాష్టారి చేతుల్లో సిన్నోడి మార్కుల జాబితా.

ఆయన నోటినుండి ఏం సమాధానం వినవలసి వస్తుందోనని ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్నాడు రావు(డు.

"చదువురాక కాయకష్టం చేసుకొని బ్రతుకుతూ, కనీసం కన్నకొడుక్కయినా నాలుగక్షరమ్ముక్కలు చెప్పించి పైకి తెచ్చుకోవాలని బాధ్యతగల కన్న తండ్రిగా నువ్వు పడుతున్న ఆరాటానికి నిన్నభినందిస్తున్నాను రావు(డు! కానీ యిప్పటికే చాలా ఆలస్యం చేశావు

మవ్వు. విన్నటితో అడ్మిషన్లన్నీ పూర్తయిపోయాయి!"

రావుఁడి తలమీద పిడుగు పడ్డట్లు అయింది.

"అంత మాటనకం డయ్యగోరూ! కడుపుగట్టుకొనయినా ఈణ్ణి సదివించు కోవాలని ఈళ్ళమ్మ తెగ ఆరాటపడి పోతన్నాది!"

"యింత మంచి మార్కులొచ్చిన కుర్రాణ్ణి వొదులుకోవటానికి నాకూ మన సొప్పటంలేదు రావుఁడూ! పోనీ ఓ పని చేస్తాను. ఆరవతరగతిలో ఓ స్టూడెంటు వాళ్ళ తండ్రికి వేరే ఊరు బదిలీ అయిన కారణంగా ఈ ఊరొదిలి వెళ్ళిపోతున్నానని చెప్పాడు. బహుశా అతను మరో వారంరోజుల్లో స్కూలువదిలి వెళ్ళిపోవచ్చు. అతని స్థానంలో మీవాణ్ణి చేర్చుకొనే ఏర్పాటు చేస్తాను!"

"తమరి మేలు ఈ జలమలో మరిసిపోనయ్యగోరూ!" ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిపోతూ చేతులెత్తి నమస్కరించాడు రావుఁడు.

"యిందులో నేను చేసిందేమీలేదు! నీ అదృష్టం బాగుండి నీ కుర్రాడు నాలుగక్షరంముక్కలు నేర్చుకొని జీవితంలో పైకొస్తే నాలాంటి మేష్టారికి అంతకంటే కావలసిందేముంటుంది? చూడు రావుఁడూ! హైస్కూలు చదువంటే మాటలు కాదీ రోజుల్లో! కుర్రాడికి మంచి బట్టలు కుట్టించాలి! బోలెడన్ని పుస్తకాలూ, నోట్సులూ కొనివ్వాల్సి వుంటుంది. కనీసం ఓ మూడొందల రూపాయలవరకైనా ఖర్చుంటుంది మొదట్లో!

'మూడొందల్రూపాయలు!'

గతుక్కుమంది రావుఁడి గుండె!

"డబ్బు లేదనో, మరే యితర కారణంచేతనో కుర్రాడి చదువును మధ్యలోనే ఆపేయకుండా వాడు చదువేంత వరకూ చదివించుకో! మంచి మార్కులొస్తే ప్రభుత్వం స్కాలర్‌షిప్పుల రూపంలో డబ్బు సాయంచేస్తుంది."

అలాగేనంటూ తలూపాలు రావుఁడు!

"మంచివి రెండు జతల బట్టలు కుట్టించి కుర్రాణ్ణి వారంరోజుల్లో తీసుకురా!"

"అట్టాగే నయ్యగోరూ!" చేతులు జోడించి సిన్నోడితోసహా వెనుదిరిగాడు రావుఁడు.

*　　*　　*

రాత్రి భోజనాలయింతర్వాత అరుబయట చీకట్లో నులకమంచంమీద మేనువాల్చాడు రావుఁడు.

"హైస్కూలు చదువంటే మాటలు కాదీ రోజుల్లో. కనీసం ఓ మూడొందల రూపాయల వరకయినా ఖర్చుంటుంది మొదట్లో!"

"మంచివి రెండు జతల బట్టలు కుట్టించి కుర్రాణ్ణి వారంరోజుల్లో తీసుకురా!"

హెడ్మాష్టారి మాటలే పదేపదే గుర్తొస్తున్నాయి రావుడికి!

"వారంరోజుల్లో సిన్నోణ్ణి అయిస్కూల్లో జేర్చుకుంటామన్నారు. ఈ వారంరోజుల్లోనూ రాత్రీ పగలూ రిక్షా లాగయినా ఆ మూడొందలూ సంపాదించాల!"

"ఏంది మావాఁ ఆలోసిత్తన్నావ్?" యింట్లో పన్లన్నీ చక్కబెట్టుకుని, తడికె తలుపుకు గొళ్ళెంపెట్టి ఆరుబయట నేల మీద నడుంవాలుచ్చుతూ అడిగింది సీతాలు!

"అబ్బే ఏం లేదే!"

బలవంతంగా కళ్ళు మూసుకొంటూ నిద్ర కుపక్రమించాడు రావుఁడు.

* * *

చూస్తుండగానే అయిదార్రోజులు గిర్రున తిరిగాయి!

ఈ అయిదార్రోజుల్లోనూ తిండీ తిప్పలూ మరిచిపోయి రాత్రీ, పగలూ రిక్షాలాగి ఓ నూటయాభై రూపాయల వరకూ సంపాదించగలిగేడు రావుఁడు.

* * *

"బాబూ రిచ్చా!"

"రిచ్చా సార్!"

.........

.........

"రిచ్చా కావాలా బాబూ?"

గుండెలలిసిపోయేలా గొంతుమార్చి రకరకాలుగా అరుస్తున్నాడు రావుఁడు! రోడ్డుమీద వచ్చేపోయే జనంలో ప్రతి ఒక్కర్నీ ఆపి రిక్షా ఎక్కమని బ్రతిమలాడుతున్నాడు. రిక్షా ఎక్కిన ప్యాసింజర్లను ఎవరు చేరవలసిన చోటుకు వాళ్ళను చేర్చి క్షణాల్లో తిరిగొస్తున్నాడు.

అన్నం, నీళ్ళు అన్న పదాల్ని దాదాపు మరిచిపోయేడు రావుఁడు ఆ అయిదార్రోజుల్లోనూ! ఒకచే రిక్షా తొక్కటం తప్ప రాత్రీ, పగలుకు తేడా గుర్తించే స్థితిలో లేడతను! అతని మస్తిష్కంలో ఉన్నదల్లా ఒక్కటే ఆలోచన!

"రేపట్లోగా సిన్నోడి సదువు క్కావల్సిన ఆ మూడొందలూ పూర్తి జెయ్యాల!"

రిక్షా తొక్కి తొక్కి అలసిపోయిన శరీరాన్ని ఓ గ్లాసుడు మంచినీళ్ళతో సేద దీర్చేందుకు ఓ టీకొట్టు ముందాగాడు రావుఁడు.

"రేయ్ రావుఁడూ!"

అలవాటయిన ఆ కంఠంలోని కాఠిన్యానికి పిట్టలా గజగజ వణికిపోయాడు రావుఁడు!

చింతనిప్పుల్లాంటి ఎర్రటి కళ్ళతో నమిలి మింగేసేలా కోపంగా చూస్తూ రావుఁణ్ణి సమీపించాడు రిక్షా ఓనరు రాజారావు!

"ఏరా! నీకోసం వారంరోజుల్నుండీ ఊరంతా గాలిస్తుంటే యియ్యాల దొరికావ్. నడు షెడ్డుకి!" చిన్నసైజు

కొండలాంటి తన శరీరాన్ని రిక్షాలో కూలేసి గాండ్రించాడు దెబ్బతిన్న పులిలా రిక్షాఓనరు.

రిక్షాలో 'కొండ'ను మోసుకొంటూ క్షణాల్లో 'షెడ్' ముందుకొచ్చాడు రావుఁడు.

"ఏరా ఎదవనంజికొడకా! ఎవడి బాబుగాడి సొమ్మనిరా వారంరోజుల్నుండీ బాడుగ కట్టకుండా బండి వాడుకుంటున్నావ్!" బక్కచిక్కిన రావుఁడి శరీరాన్ని తన చేతుల్లోకి తీసుకొని నలిపేస్తున్నాడు రాక్షసుడిలా రిక్షాఓనరు.

"రొండ్రోజులాగు దొరా! నీ బాడుగ మొత్తం యిచ్చేత్తాను!" ప్రాధేయపడ్తూ రిక్షాఓనరు కాళ్ళమీద పడ్డాడు రావుఁడు.

"థూ! యెదవనాకొడకా! బాడుగ డబ్బులు కట్టకుండా బండియ్యటానికి సిగ్గులేదంట్రా. బాడుగ బాకీ మొత్తం అరవై రూపాయలూ కట్టి బండి తీసుకెళ్ళు!" కాలితో బలవంతంగా ఒక్క తోపు తోశాడు రిక్షాఓనరు! ఆ తోపుకు కొండను ఢీకొన్న పక్షిలా క్షణంలో రోడ్డుమధ్య జనంలోకొచ్చి పడ్డాడు రావుఁడు.

"దయుంచు దొరా! నా బిడ్డడి సదువు కోసం కట్టపడి రేత్తిరీ పగలూ రిచ్చాలాగి డబ్బులు కూడబెట్టుకుంటున్నాను. యింకొక్క రోజాగితే ఆ డబ్బులు పూర్తయిపోతాయి. ఆ తరవాత నీ బాకీ తీర్చేత్తాను! నువు బండియ్యకపోతే నా పిన్నోడిది సదువాగిపోద్ది! సదువంటే ఆడికి పేణం దొరా!... దొరా!... దొరా!!..."

రావుఁడు గుండెల్ని బాదుకుంటున్నాడు! ఎముకల గూడులాంటి అతని శరీరంలో ఏ మూలో మిగిలున్న రక్తం కన్నీరుగా మారి క్షణాల్లో కళ్ళనుండి కాలువలై ప్రవహిస్తోంది! అతని ఆక్రందనలకు చలించని రిక్షాఓనరు రాతిగుండె షెడ్లోకి దూరి తలుపేసుకుంది!

"రావుఁడూ!"

చేసేదేమీ లేక నిస్పృహాయంగా వెనుదిరిగిన రావుఁడి భుజమ్మీద వెనుకనుండి పడిందో చల్లని చేయి!

"కట్టవొఁచ్చినా, సుకవొఁచ్చినా పేదోడికి పేదోడే సాయంరా రావ్డూ! పంచబచ్య పరవాఁన్నా లెట్టలేకపోయినా యియ్యాల్టిదాకా నా పెల్లాంబిడ్డలకి తిండికి లోట్లేదు! యియ్యాలొక్క రోజు పస్తున్నంత మాత్రాన అల్లకొచ్చిన నట్టపేఁపీఁ లేదు! నా బండి తీసుకెల్లి నీ బిడ్డడి బవుచ్యత్తుని కాపాడుకో!" దుఃఖంతో బావురుమంటున్న రావుఁడికి తన రిక్షాయిచ్చి భుజంతట్టి పంపించాడు తోటి రిక్షావాలా!

కన్నీటి కళ్ళను తుడుచుకొంటూ రిక్షాతో సహా క్షణాల్లో జనాల్లో కలిసిపోయాడు రావుఁడు.

* * *

ఎండ మండిపోతోంది!

ఆకాశపు చేటలో సూర్యుడు చంద్ర విస్ఫులింగాలు చెరుగుతున్నాడు.

'గంటసేపట్నుంచీ ఒక్క బేరం తగల్లేదు! యిప్పటికి అతి కట్టమ్మీద రొండొందలు పోగు చెయ్యగలిగేడు తాను. యింకో వంద పోగవ్వాలి!'

బేరాలవేటలో మైళ్ళదూరాన్ని వెనక్కు తోసుకొంటూ నడిరొడ్డుమీద ముందుకు సాగిపోతోంది రావుఁడి రిక్షా! రిక్షా సీటుమీద చెఘట్లు కక్కుకొంటూ ఆయాసంతో ఊగిపోతోంది రావుఁడి శరీరం!!

"ఏయ్ రిక్షా! ధర్మాసుపత్రికొస్తావా?"

ఎడారిలో నీటిచుక్కలా రావుఁడి చెవుల్ని తాకిందా పిలుపు! వేల లక్షల చప్పుళ్ళమధ్య ఒక్క సంగీతస్వరంలా ఆనందంతో రావుఁడి గుండెల్ని మీటిందా పిలుపు!!

"వొస్తా బాబూ!"

మరుక్షణంలో రోడ్డుమీద జీరందుకొంది రావుఁడి రిక్షా!

'దరమాసుపత్రి!'

'దరమాసుపత్రిలో రకతం అమ్ముకుంటే డబ్బులిత్తార్రా!' ఎన్నాళ్ళకిందటో మాటల సందర్భంలో తన తోటి రిక్షావాలా 'కోటిగాడు' చెప్పిన మాటలు గుర్తొచ్చాయి రావుఁడికా క్షణంలో!

"తవఁరు దరమాసుపత్తిర్లో పన్జేత్తారా బాబూ?" ఉండబట్టలేక అడిగాడు ప్యాసింజర్ని.

"అవును! ఏం?"

"అ యాసుపత్రిలో రకతం అమ్మితే డబ్బులిత్తారా బాబూ!" కోటిగాడి మాటలు నిజమో కాదోనన్న అనుమానం రావుఁడి మనసులో!

"అవును! మనిషి రక్తాన్ని పరీక్ష చేసి, మంచిది అని నిర్ధారణ అయితే తీసుకొని దానికి బదులుగా డబ్బులిస్తారు!..."

యింక మిగతా మాటలేవీ రావుఁడి చెవుల్లో కెక్కటంలేదు!

ఆనందంతో ఊగిపోతున్న రావుఁడి మనసులో తళుకుమంటూ ఓ 'అలోచన!'

అంతే!


రెప్పపాటు కాలంలో రెట్టించిన వేగంతో రిక్షాతో సహా 'ధర్మాసుపత్రి' ముందున్నాడు రావుఁడు!

• • •

ఆనందంతో మెరిసే కళ్ళతో 'ధర్మాసుపత్రి' నుండి బయటపడ్డాడు రావుఁడు!

జేబులోని డబ్బుల్ని మరోసారి జాగ్రత్తగా లెక్కపెట్టుకున్నాడు.

"ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలి! రిక్షా తొక్కకూడదు!" రక్తం తీసినతర్వాత హాస్పిటల్‌నుండి డిశ్చార్జి చేస్తూ డాక్టర్ చెప్పిన మాటలు గుర్తొచ్చి తనలో తనే నవ్వుకున్నాడు రావుఁడు.



'డ్రైబాబు లట్టాగే సెబుతారు. తన్లాంటి పేదోడికి కట్టపడందే కంచం లోకి కూడెట్టాగొత్తాది? అయినా తన కిప్పుడు నీరసంగా లేన్లేలేదు! పైగా చాలా ఆనందంగా వుంది.

'సిన్నోడి సదువుక్కావాల్సిన మూడొందలూ పూర్తయ్యాయి! ఆలీసెం సెయ్యకుండా రేపే అణ్ణి అయిస్కూల్లో ఏసెయ్యాల!'

ఆలోచిస్తూనే రిక్షాని యింటివైపు నడిపిస్తున్నాడు రావుడు.

రేపట్నుండీ...

తన 'సిన్నోడు'...

మల్లెపువ్వుల్లాంటి బట్టల్లో మెరిసిపోతూ...

కాళ్ళకి నిగనిగలాడే నల్లటి బూట్లేసుకొని...

సేతులు పట్టనన్ని పెద్దపెద్ద పుస్తకాలు మోసుకొంటూ...

దొర బిడ్డలా దర్జాగా అయిస్కూల్కెల్తాడు!

రోజూ 'సిన్నోణ్ణి' తన రిక్షాలోనే స్కూలుకు తీసుకెళ్తాడు!

'అడికి టైముకి కేరేజీ కట్టి బడికి సాగనంపుతూ ఆనందంతో మెరిసే కళ్ళతో గుమ్మంలో నిలబడి సూత్తుంటాది ఆళ్ళమ్మ! రిక్షాలో అణ్ణి కూసోబెట్టుకోని అదుగడుక్కూ బెల్లుకొడుతూ గర్వంగా అందరి మొకాల్లోకీ తలెత్తి సూటిగా చూస్తాడు తను!'

ఆనందపుటాలోచనల్లో మునిగి తేలుతూ రోడ్డుమధ్యకొచ్చింది రావుడి రిక్షా!

అంతే!!

మరుక్షణంలో...

ఎక్కుపెట్టి విడిచిన బాణంలా గావుకేక వేస్తూ క్షణాల్లో రిక్షాతో సహా

గాల్లోకి లేచింది బక్కచిక్కిన రాముడి శరీరం!

జరిగిందేమిటో అర్థంకాని అయోమయంలో అదుపుతప్పి రోడ్డుపక్కనున్న ఓ ఎలక్ట్రిక్ స్తంభాన్ని గుద్దుకొని రొదపెడ్తూ ఆగిపోయింది రాముడి రిక్షాని ముద్దుపెట్టుకొన్న లారీ!

◆ ◆ ◆

నెల రోజులు గడిచాయి.

పదిరోజులపాటు హాస్పిటల్ లో 'మృత్యువు'తో హోరాహోరీ పోరాడి గెలిచి, మరో ఇరవై రోజుల విశ్రాంతి అనంతరం ఆ రోజే డిశ్చార్జయి యింటికొచ్చాడు రాముడు!

హాస్పిటల్లో డాక్టర్లు పనికిరావంటూ తీసివేసిన తన రెండుకాళ్ళకూ బదులుగా సానుభూతితో ప్రభుత్వం యిచ్చిన చక్రాల కుర్చీలో తన మొండెంలాంటి శరీరాన్ని కూర్చోబెట్టి అరుగుమీద నుండి ఒచ్చేపోయే జనాన్ని చూస్తున్నాడు రాముడు!

రెప్పపాటు కాలంలో రోడ్డుమీద అటూ యిటూ వేగంగా సాగిపోతున్నాయ్ ఎన్నో రిక్షాలు! గణగణమని గంటలశబ్దం చేసుకుంటూ ముందుకు దూసుకుపోతున్నాయ్!! ఆ రిక్షాల్లో ఎందర్నో ... యింకెదర్నో లాగుతూ సీటుమీద ఊపిరి బిగబట్టి ఆయాసంతో ఊగిపోతున్నారు తన్లాంటి ఎందరో రాముళ్ళు!!

అందర్లా తనూ రిక్షా తొక్కాలనిపించింది రాముడికి!

కానీ అంతలోనే తన అశక్తత గుర్తొచ్చి ఆ కోరికను మనసులోనే అణచుకున్నాడు.

రాముడి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ కీచుమని శబ్దంచేస్తూ యింటి ముందుకొచ్చి ఆగిందో రిక్షా!

"యిక్కడాపావేం?" చిరాకుగా ప్రశ్నిస్తోంది రిక్షాలోని కంఠం!

"ఒక్క నిముసం బాబూ!" రిక్షా దిగి యింట్లోకి దారితీసింది బక్కచిక్కిన శరీరం!

'సిన్నోడు!' వణుకుతోన్న పెదవుల్తో అస్పష్టంగా తనలో తనే గొణుక్కున్నాడు వొచ్చే మనిషిని గుర్తిస్తూ రాముడు.

"ఇయ్యగోనయ్యా! బియ్యమూ, మిరపకాయలూనూ! అమ్మ పన్లొంచి రాగానే యిచ్చి వొంట సెయ్యమని సెప్పు!" తన సమాధానాన్ని ఆశించకుండా పరుగులాంటి నడకతో రిక్షావైపు నడిచాడు 'సిన్నోడు.'

క్షణంలో రోడ్డెక్కింది సిన్నోడి రిక్షా!

శక్తికి మించిన బరువును లాగుతూ ఆయాసపడుతూ రిక్షా సీటుమీద ఎగిరెగిరి పడుతుంది పదేళ్ళ సిన్నోడి శరీరం!

"త్వరగా పోనీవోయ్! సినిమాకి టైమైపోతోంది!" పెద్దగా విసుక్కుంటున్నాడు రిక్షాలోని ప్యాసింజరు!

రిక్షా రోడ్డు మలుపు తిరిగేవరకూ అలాగే బొమ్మలా చూస్తుండిపోయాడు రాముడు.

'సిన్నోణ్ణి సదివించుకుందాం మావా!' సీతాలు మాటలు గుర్తొచ్చి అప్రయత్నంగా రెండు కన్నీటిచుక్కలు రాలాయి రాముడి కళ్ళల్లోంచి.

+